క్లుప్తంగా

మున్నూరుకాపు జిల్లా యువజన కమిటీ

హన్మకొండ: మున్నూరుకాపు యువజన విభాగం హనుమకొండ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రంగరాజు సాయి కుమార్, ఉపాధ్యక్షులుగా మాడిశెట్టి సతీష్, బక్కి అవినాష్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా కత్తుల అభిషేక్, సంయుక్త కార్యదర్శులుగా మాడిశెట్టి రాజేష్, మంద రాకేష్, గోపు సురేందర్, వేముల ప్రభాకర్, శంఖేషి వినయ్, గోపు సాయిరాం ఎన్నికయ్యారు. న్యాయసలహాదారులుగా నల్లెల సురేందర్, పుప్పాల లక్ష్మీనారాయణ, బజారు శ్యామ్ ప్రసాద్, బోనాల అనిల్ ఎన్నికయ్యారు.

జనసేన పార్టీ కో ఆర్డినేటర్‌గా బాలుగౌడ్

ఖిలా వరంగల్: జనసేన పార్టీ వరంగల్ తూర్పు నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా శివనగర్‌కు చెందిన తాళ్లపెల్లి క్రాంతికుమార్ (బాలుగౌడ్) నియమితులయ్యారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ శంకర్‌గౌడ్, వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ ఆకుల సుమన్ నుంచి మంగళవారం బాలు గౌడ్ నియామక ఉత్తర్వులను అందుకున్నారు. పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన పార్టీ నేతలకు బాలుగౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రిఫ్రిజిరేటర్ బహూకరణ

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని జిల్లా గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సౌకర్యార్థం దూప ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రిఫ్రిజిరేటర్ ను బహూకరించారు. ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు కొమ్మిడి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా రిఫ్రిజిరేటర్‌ను గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్‌కు అందజేశారు. అమరేందర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, రాజేశ్‌గౌడ్, అక్షయ్‌యాదవ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట, వినాయక నగర్, హౌజింగ్‌బోర్డు కాలనీ, అశోక కాలనీ, గోకుల్‌నగర్, వికాస్‌నగర్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, రాంనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

డాన్స్ పోటీలు

నయీంనగర్: ఈ నెల 26, 27న హన్మకొండ అంబేద్కర్ భవన్‌లో డాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు క్రాంతికుమార్ తెలిపారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంట్రీ ఫీజు సోలోకి రూ.500, గ్రూప్ 700 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో శ్రవన్, పవన్, బాలు, సాయి పాల్గొన్నారు.

నేత్రాల సేకరణ


లక్ష్మి (ఫైల్)

హసన్‌పర్తి: అనారోగ్యంతో మృతి చెందిన నగరంలోని 1వ డివిజన్ ముచ్చర్ల వాసి ఓరుగంటి లక్ష్మి నేత్రాలను సేకరించారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో మంగళవారం కార్యక్రమం జరిగింది. మృతురాలి కుమారులు గణపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అంగీకారంతో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల, ఎల్వీప్రసాద్ ఐ టెక్నీషియన్ నరేందర్ ఆధ్వర్యంలో మృతురాలి నేత్రాలు సేకరించారు. కార్యక్రమంలో తెలంగాణ నేత్ర అవయవ శరీర దాల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, బంధు మిత్రులు చల్లా వెంకట్‌రెడ్డి, రాజమణి, సుజాత పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి సృజనోత్సవ శిక్షణ

హన్మకొండ అర్బన్ : ఈ నెల 18 నుంచి 22 వరకు జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ, వన విజ్ఞాన కేంద్రం సంయుక్త అధ్వర్యంలో హంటర్‌రోడ్డులోని వనవిజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు ఉచిత వేసవి 'సృజనోత్సవ శిక్షణ శిబిరం' నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు గణితం, భౌతిక, రసాయన, జీవశాస్త్రం, డ్రాయింగ్, ఒరిగామి, ఆంగ్ల భాష నైపుణ్యాలు, తదితర అంశాల పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులు 9490133650, 9989732423 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అవగాహన సదస్సు

మడికొండ: సైబర్ నేరాలపై ఇండస్ట్రీయల్ ఏరియాలోని మహిళా కార్మికులకు స్థానిక సీఐ వేణు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తేజస్వీ అపెరల్ పార్క్‌లో పని చేస్తున్న మహిళా కార్మికులకు మంగళవారం ఆయన బాల కార్మికుల వ్యవస్థపై అవగాహన కల్పించారు. మహిళల అక్రమరవాణా, ఏమైనా సమస్యలు ఉంటే 100 డయల్ చేయాలని సూచించారు. ఎస్సై దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

- కీటక జనిత వ్యాధుల ప్రోగ్రాం అధికారి డాక్టర్ మదన్ మోహన్‌రావు


హన్మకొండ చౌరస్తా: ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ మదన్‌మోహన్‌రావు

హన్మకొండ చౌరస్తా : జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, వరంగల్ నగర పాలక సంస్థ అర్బన్ మలేరియా సంయుక్తంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వరకు సాగిన ర్యాలీని కీటక జనిత వ్యాధుల ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు జెండా ఊపి ప్రారంబించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ బయాలజిస్టు మాధవరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్‌పాషా, ప్రోగ్రాం అధికారి ఉమాశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

దేశాయిపేట: దోమలను నివారించుటకు ప్రతి ఒక్కరూ తమ ఇండ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్ అన్నారు. స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ తీవ్రమైన వేడితో కూడిన జ్వరం భరించలేని తలనొప్పి కనుగుడ్లు కలిపితే నొప్పి రెండింతలు, చర్మంపై దద్దుర్లు జ్వరం తగ్గకుండా మూడు నుంచి ఐదు రోజుల వరకు ఉన్నట్లయితే డెంగీగా భావించాలని అన్నారు. ర్యాలీలో అవగాహన కల్పించేందుకు కరపత్రాలను పంపిణీ


దేశాయిపేట : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విజయేందర్ సూపర్‌వైజర్ జన్ను కోర్నేల్, కుమార్, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి : జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉన్నత శ్రేణి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. దోమలు పుట్టకుండా..కుట్టకుండా చూసుకుందాం..డెంగీని తరి మికొడుదాం అంటూ నినాదాలు చేశారు. డాక్టర్ క్రాంతి కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివ కుమార్, ఆరోగ్య సిబ్బంది లీలా, కందుకూరి సంతోష్, నాగేష్, ఇంద్రారెడ్డి, రాజ్‌కుమార్, ప్రశాంతి,రజిత, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


హసన్‌పర్తిలో..

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

హసన్‌పర్తి : ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. దూప ఫౌండేషన్ అధ్యక్షుడు చల్లా అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు కొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఫౌండేషన్ సైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అధ్యక్షుడు చల్లా అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదల విద్యార్థులకు దూప ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రాజేష్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, అక్షయ్‌యాదవ్, రాజేష్‌గౌడ్, అధ్యాపకులుపాల్గొన్నారు.


విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దూప ఫౌండేషన్ ప్రతినిధులు

ఆలయ నిర్మాణానికి విరాళం

మామునూరు: ఖిలావరంగల్ మండలం బొల్లికుంటలో ముదిరాజ్‌ల సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీపెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి, కాకతీయ యూనివర్సిటీ పార్ట్ టైం లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్ శ్రీలేఖ, మాజీ ఎంపీటీసీ వరలక్ష్మి రాజ్‌గౌడ్‌లు మంగళవారం రూ.25,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌లు దాతలకు శాలువాతో ఘనంగా సన్మానించారు.

నేడు ఉద్యోగులతో సమావేశం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బుధవారం ఉదయం 10గంటలకు పరిపాలనాభవనంలో సెనెట్‌హాల్‌లో నాన్‌టీచింగ్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. న్యాక్ టీం ఈనెల 25, 26, 27 తేదీల్లో కేయూలో పర్యటించనున్నది.రెగ్యులర్ ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

మూఢవిశ్వాసాలను వీడాలి

కాజీపేట అర్బన్ : మహిళలు మూఢ విశ్వాసాలను వీడి సమాజ మార్పుకు పాటుపడాలని నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ రాంచంద్రయ్య తెలిపారు. మండలంలోని న్యూశాయంపేటలో మంగళవారం ప్రజాతంత్ర మహిళా సమైఖ్య హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రాజకీయ విజ్ఞాన శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో మహిళలు పురుషులకు ధీటుగా రాణించాలని అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వస్కుల సైదమ్మ, కన్వీనర్ సావిత్రి, సుకన్య, రాగసుధ,పాల్గొన్నారు.

ఈద్గాకు రక్షణ చర్యలు కల్పించాలి

ఖిలా వరంగల్: ఈద్గాకు భద్రతపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని, నూతన కమిటీ సహాయ సహకారాలు అందించాలని ఖిలావరంగల్ ఈద్గా అధక్షుడు ఎంఏ జబ్బార్ కోరారు. మంగళవారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌ను ఈద్గా నూతన కార్యవర్గ ప్రతినిధులతో కలిసి ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు ఎంఏ జబ్బార్ పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జబ్బార్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు అస్తులు పరిరక్షణే ధ్యేయంగా నూతన కార్యవర్గం పని చేస్తుందన్నారు. ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సహకారంతో ఈద్గాను సర్వ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సయ్యద్ సంజరీ, ఎండీ.చాంద్‌పాషా, ముఖాబీర్, హసన్ అలీ బేగ్, ఎండీ.అశ్రఫ్, ఎండీ.శర్ఫొద్దీన్, ఎండి అమ్జద్ ఖాన్, ఎండీ. సాధిక్, ఎండీ మహియొద్దిన్, ఎండీ.గఫూర్, ఎండీ. మహబూబ్, మాషూక్, ఎండీ. మస్తాన్ పాల్గొన్నారు.


సీఐని శాలువాతో సత్కరిస్తున్న కమిటీ బృందం

పోలీస్ సిబ్బందికి మజ్జిగ పంపిణీ


హన్మకొండ చౌరస్తా : ట్రాఫిక్‌పోలీస్ సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న కిశోర్


వరంగల్ చౌరస్తా: మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీనివాస్, సీఐ మల్లేష్ యాదవ్

హన్మకొండ చౌరస్తా: హైదరాబాద్‌లో ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న హనుమకొండలోని గుండ్లసింగారానికి చెందిన నమిండ్ల కిశోర్ మంగళవారం ట్రాఫిక్ పోలీసులకు మజ్జిగ పంపిణీ చేశారు. కేయూ జంక్షన్ నుంచి మొదలుకొని వరంగల్ రైల్వేస్టేషన్ వరకు ప్రధాన కూడళ్లలో మండుటెండలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. కిశోర్ గతంలో హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించాడు. ఎండలను సైతం ఖాతరు చేయకుండా విధులు నిర్వహించడం అసాధారణ విషయమన్నారు.

వరంగల్ చౌరస్తా : వరంగల్ పాత బీటుబజారులో ఆర్యవైశ్య మిత్రబృందం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దుబ్బా శ్రీనివాస్ నేతృత్వంలో మంగళవారం మజ్జిగ పంపిణీ రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇతెజార్‌గంజ్ సీఐ మల్లేష్ యాదవ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్, కార్యదర్శి గార్లపాటి నాగేంద్ర బాబు ఆర్యవైశ్య మిత్ర బృందం నాయకులు పాల మురళీధర్, ఎర్ర ప్రకాశం, అల్లాడి వీరభద్రయ్య ,పల్లా పరమేశ్వర్, యాద గణేష్, జౌదం కర్ణాకర్, శ్రీధర శ్రీనాథ్, హోలం శంకర్, పాల్గొన్నారు.

కాశిబుగ్గ : వరంగల్ కాశిబుగ్గలో లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ప్రతాపగిరి కిరణ్‌కుమార్, మౌనిక దంపతులు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్ మాట్లాడుతూ సభ్యులు, దాతల సహకారంతో గత 30 రోజులుగా బాటసారులకు చల్లని మంచినీటితో పాటు మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మండల సురేష్, వేముల నాగరాజు, వంగరి రవి, శివ కృష్ణ, ఆదికిరణ్, కృష్ణ, చందు, రాజు, రవీందర్,పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి



వరంగల్: తెలుగువారి గౌరవాన్ని ప్రపంచానికి చాటిన టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి రాష్ట్రం మాజీ సీఎం నందమూరి తారకరామారావుకు భారత రత్న పురస్కారం అందించాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, వరంగల్ పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య అన్నారు. మంగళవారం వరంగల్ ములుగురోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మినీ మహానాడు నిర్వహించారు. మొదట పోలీస్ హెడ్ క్వార్టర్ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పశ్చిమ కో–ఆర్డినేటర్ యండి.రహీమ్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించి ర్యాలీగా సభ వేదికకు చేరుకుని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మినీ మహానాడులో పలు తీర్మానాలు ప్రవేశపెట్టి వరంగల్ పార్లమెంట్ నాయకులతో బలపరిచి రాజమండ్రిలో జరిగే మహా నాడుకు ప్రతిపాదించారు. బండి పుల్లయ్య, శ్రీనివాసచారి, రహీం, సంధ్య రాజశేఖర్, బాబా ఖాదర్ అలీ, మరియ, అజ్మీరా రాజునాయక్, గట్టు ప్రసాద్‌బాబు, విద్యాసాగర్‌రావు, సాంబయ్య, సురేష్ పాల్గొన్నారు.

క్రీడారంగానికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యం

వరంగల్ స్పోర్ట్స్: సీఎం కేసీఆర్ క్రీడారంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని , క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం అని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న క్రీడా సంబురాలు మంగళవారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులు పాటు జరగనున్న హనుమకొండ, కాజీపేట మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై మేయర్ గుండు సుధారాణి తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభింభించారు. మొదటి రోజు హనుమకొండ మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ అంశాలలో స్త్రీ , పురుషుల విభాగాలలో పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 22న నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ జోనా తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ అశోక్, మాజీ జెడ్పీ చైర్మన్ సమ్మారావు, పీఈటీ, పీడీ, కోచ్ లు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి

క్రీడలతోనే సమాజంలో గుర్తింపు

కాశిబుగ్గ : క్రీడల్లో రాణించడం ద్వారా సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఇంతెజార్‌గంజ్, మట్టెవాడ సీఐలు మల్లేష్, వెంకటేశ్వర్లు, 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి అన్నారు. రెండో రోజు మంగళవారం ఓ సిటీ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ క్రీడాపోటీలను వారు ప్రారంభించారు. అనంతరం సీఐలు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలలో రాణించాలన్నారు. స్పోర్ట్స్ అధికారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేయొద్దు

- వాహనానికి నంబర్ ప్లేటు తప్పనిసరి
- హెల్మెట్ లేకుంటే జరిమానా తప్పదు
- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ బాబులాల్

మామునూరు: వాహనాలను మైనర్లు డ్రైవ్ చేయొద్దని..నిబంధనలను దిక్కరించి డ్రైవ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని మట్టెవాడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ హెచ్చరించారు. మంగళవారం ఖిలావరంగల్ మండలం మామునూరులోని పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ 10టీ బాలికల బెటాలియన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో మట్టెవాడ ట్రాఫిక్ పోలీసుల నేతృత్వంలో 411 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీఐ బాబులాల్ హాజరై మాట్లాడుతూ వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్ ఉండాలని, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. వాహనం వెంట సరైన ధ్రువీకరణ పత్రాలు ఉండాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాన్ని నడపాలని, హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని, మద్యం తాగి వాహనాలను డ్రైవ్ చేయొద్దని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ అధికారులు రాజేష్ కౌశిక్, మేజర్ రేవతి, ప్రభాకర్, సీనియర్ సుబేదార్ చేతన్ మాన్‌దాస్, బాల ఒబయ్య, క్యాడెట్లు పాల్గొన్నారు.

నంబర్‌ప్లేట్‌లేని వాహనాలు సీజ్

రామన్నపేట : నంబర్ ప్లేట్ లేకుండా, నంబర్ ట్యాంపరింగ్ చేస్తూ ద్విచక్రవాహనాలను నడుపుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో కనుకుంట్ల మురళీ, గూడురు సంతోష్, సాంబరాజు కుమార్‌తో మరో ముగ్గురు నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న విషయాన్ని గుర్తించి చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.

గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య

కాశిబుగ్గ : ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న వారందరికీ పట్టాలు ఇచ్చి ఇండ్లు కట్టించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఏసీరెడ్డినగర్ రఘునాథభవన్‌లో సీపీఎం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖిలావరంగల్ మండల పరిధిలో ఉన్న ఏసీరెడ్డినగర్, మైసయ్యనగర్, రామ సురేందర్‌నగర్, జ్యోతిబస్‌నగర్‌లలో పేదలు గత కొన్నేళ్లుగా ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారన్నారు. వారందరికీ పట్టాలు ఇచ్చి ప్రభుత్వమే ఇళ్లు కట్టివ్వాలన్నారు. సీపీఎం కార్యకర్తలను బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్న క్రమంలో గుడిసె వాసులందరికీ 3 రోజుల్లో పట్టాలు పంపిణీ చేస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసిందన్నారు. ఎనిమిదేండ్లు కావస్తున్న వాటిపై అతిగతీ లేదన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు నలిగంటి రత్నమాల, వి.దుర్గయ్య, ఆవుల ఉదయ్, వెంకటేశ్వర్లు, వేణు, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మంజూరైన పనులు పూర్తి చేయాలి

హసన్‌పర్తి: నగరంలోని 66వ డివిజన్‌లో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని కార్పొరేటర్ శివకుమార్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హసన్‌పర్తిలో ఉమ్మడి శ్మశాన వాటికకు బడ్జెట్ కేటాయించినప్పటికీ ఇప్పటి వరకు పనులు చేపట్టలేదన్నారు. పలు ప్రాంతాల్లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం కంకర పోసి వదిలి పెట్టారన్నారన్నారు. డివిజన్‌లోని ఆరు ప్రధానజంక్షన్‌ల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. విజయాగార్డెన్ నుంచి బొత్తల కుంట వరకు ఉన్న డ్రెయినేజీని శుభ్రం చేయాలని కార్పొరేటర్ కోరారు.

మైనారిటీ గురుకుల విద్యార్థినికి రాష్ట్రస్థాయి ర్యాంకు


నాజియాసుల్తానా

న్యూశాయంపేట : ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో వరంగల్ శంభునిపేట దూపకుంట రోడ్‌లోని వరంగల్(జి)2, విద్యార్థినిని నాజియాసుల్తానా (ఎంఈసీ ఫస్టియర్) అత్యంత ప్రతిభ కనబరిచి 484 మార్కులతో రాష్ట్రస్థాయి రెండవ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీపాల తెలిపారు. అలాగే సెకండియర్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనారిటీ గురుకులాల్లో ద్వితీయ స్థానం పొందిందన్నారు. పది ఫలితాల్లో కే.సాత్విక 10/10 జీపీఏ సాధించి వరంగల్ జిల్లాల్లోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. గురుకులంలో 5, 6, 7, 8, ఇంటర్ మొదటి ఫస్టియర్‌లో (ఎంఈసీ, సీఈసీ)గ్రూపుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

హసన్‌పర్తి: మండలంలోని సీతంపేటలో మంగళవారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇళ్లు దగ్ధమైంది. ఈ సంఘటనలో రూ.3 లక్షల నగదు, 20 క్వింటాళ్ల పత్తి, మూడు తులాల బంగారు ఆభరణాలు, రెండు క్వింటాళ్ల బియ్యం, బట్టలతో ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. సీతంపేటకు చెందిన నేదునూరి సాంబయ్య కుటుంబం మంగళవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లారు. అయితే ఇంటిలో నుంచి మంటలు వ్యాపిస్తుండడంతో పక్కింటి వారు గమనించి సాంబయ్యకు సమాచారం అందించారు. స్థానిక సర్పంచ్ శరత్ సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలాన్ని చేరుకుని మంటలు ఆర్పివేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

మడికొండ: రైతులకు వానాకాలం సాగుకు కావాల్సిన సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వరంగల్ జిల్లా రీజనల్ మేనేజర్ బయ్య రఘు తెలిపారు. రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ప్రకటించారు. జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలపై రాష్ట్ర ప్రభుత్వం 65 శాతం రాయితీ ప్రకటించినట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న మండల వ్యవసాయధికారి వద్ద అనుమతి తీసుకొని వ్యవసాయధికారి కార్యాలయంలో, మన గ్రోమోర్, పీఏసీఎస్ సొసైటీల నుంచి, రైతులు విత్తనాలు తీసుకోవచ్చన్నారు.

తోపుడుబండ్లు అందజేత

హన్మకొండ చౌరస్తా : మాధవ స్మారక సమితి, ఏకశిల వైభవ మండలి, శివశక్తి స్థల్ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్ల వెంట కింద కూర్చుని పండ్లు అమ్ముకునే పేద మహిళా వ్యాపారులకు తోపుడు బండ్లను అందజేశారు. మంగళవారం హనుమకొండలోని పింజర్లవీధిలోని శ్రీరాజ రాజనరేంద్ర బాసానిలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రూ.75వేల విలువైన తోపుడు బండ్లను పలువురికి అందజేశారు. మాధవస్మారక సమితి ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ సంజీవ, ఏకశిల వైభవ మండలి బాధ్యుడు చంచల్ అగర్వాల్, శివశక్తి స్థల్ బాధ్యుడు సుధీర్‌ఆర్య, సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సయ్య, పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో మైనారిటీ గురుకులాలు

న్యూశాయంపేట : దేశంలో ఎక్కడా లేని విధంగా కార్పొరేట్ స్థాయిలో మైనారిటీ గురుకులాల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని, పేదలు తమ పిల్లలను గురుకులాల్లో చేర్పించాలని టెమ్రిస్ కౌన్సిలర్ మహ్మద్ సర్వర్ మోహియోద్దీన్ తెలిపారు. మంగళవారం నగరంలోని శివనగర్ తదితర ప్రాంతాల్లో అడ్మిషన్‌కోసం ప్రచారం నిర్వహించి మాట్లాడారు. 5 నుంచి ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియంలో ఉచిత భోజన వసతులతో పాటు విద్యాబోధన జరుగుతుందన్నారు. ఆయన వెంట నాయకులు మహ్మద్ అజ్మత్ ఉన్నారు.

పది ఫలితాల్లో 'రిషి' విద్యార్థుల జయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న రిషి పాఠశాల యాజమాన్యం

రామన్నపేట : పదో తరగతి ఫలితాల్లో వరంగల్ ఎల్లంబజార్‌లోని రిషి ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో 9 మంది 10/10 సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. అనన్య, రితీక, నవ్యశ్రీ, వైష్ణవి, సుమన, మాళవిక, ప్రావీణ్య, నందిని, సాత్వికతదితర విద్యార్థులు 10/10 సాధించి రికార్డు సృష్టించారని తెలిపారు. మరో 9 మంది 9.8, 8 మంది 9.7, ఏడుగురు 9.5, నలుగురు 9.3, ఐదుగురు 9.2, నలుగురు 9.0 శాతంలో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను యాజనంగా ఘనంగా సత్కరించి అభినందించింది.